
భోలాశంకర్
1
MB
PUBLICATIONS
మధుబాబు

# భోలాశంకర్

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# భోలాశంకర్

విపరీతమైన ఆకలితో నకనకలాడుతూ బిలాస్‌పూర్ బస్‌స్టాండ్‌లో బస్ దిగాడు గంగారాం. దిగిన వెంటనే ఎదురుగా వున్న కాంటీన్‌లోకి చొరబడ్డాడు.

“ఏం కావాలి సాబ్? ఏం తీసుకుంటారు?” అంటూ వెంటనే అతని ముందు ప్రత్యక్షం అయ్యాడు వెయిటర్ ఒకతను.

ఏమున్నాయని అడగలేదు గంగారాం. నోటికి వచ్చిన పదార్థాల పేర్లన్నింటినీ వరుసగా చెప్పేశాడు.

రెండు క్షణాలు తటపటాయించాడు వెయిటర్.

ఆలస్యాన్ని భరించలేక పోయాడు గంగారాం. అగ్గి రాముడై పోయాడు.

“ఏంటి బే ఆలోచిస్తున్నావ్? వళ్ళుఎలా వుందేమిటి?” కనుబొమ్మలు ముడిచి క్రూరంగా చూస్తూ కరుకుగా అడిగాడు.

లెక్క ప్రకారం అయితే భయంతో వణికిపోవాలి ఆ వెయిటర్. క్షణం కూడా ఆలస్యం చేయకుండా అడిగినవన్నీ తెచ్చి ఎదుట పెట్టాలి.

అటువంటి పనులు ఏవీ చేయలేదతను. మరింత సాలోచనగా చూస్తూ ఇంకా కొంచెం స్ట్రెయిట్ గా నిలబడ్డాడు.

పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఎదురవబోతున్నదని గ్రహించి వెంటనే ప్లేటు ఫిరాయించేశాడు గంగారాం.

“అవతల బస్ టైమ్ అయిపోతోంది భాయీ.. మరోలా అనుకోకుండా కొంచెం తొందరగా కదులు మేరా దోస్త్...” అంటూ అసహనంగా అటూ యిటూ

కదిలాడు. తన అర్జెన్సీని ముఖంలో ప్రతిబింబింప చేయటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు.

"పైసలు చూపించండి సాబ్... ముందు మీ జేబులో నుంచి పైసల్ని బయటికి తీయండి" ఉన్నట్లుండి అన్నాడు వెయిటర్.

సీరియస్‌గా ముఖంపెట్టిలాల్చీ జేబుల్ని తడుము కున్నాడు గంగారాం. పైజమా పాకెట్స్‌ని కూడా వెతుకుతూ "అయ్య బాబోయ్! నా పర్సు ఎవరో కొట్టేశారు" ఆందోళనగా అరిచాడు.

సానుభూతిగా చూడలేదు ఆ వెయిటర్. అమాంతంగా పట్టుకున్నాడు అతని మెడని.

"నిద్ర లేచిన దగ్గిర్నిచీ పడుకోబోయేదాకా రోజుకు సవాలక్ష మందిని చూస్తున్నాం. మొఖం ముడుచుకొని సీరియస్‌గా చూసినంత మాత్రాన బెదిరిపోతామని అనుకున్నావా? నీ దగ్గిర పైసలు ఉన్నదీ లేనిదీ తెలుసుకోలేమని అనుకుంటున్నావా...?" అంటూ రెండు వూపులు వూపి కాంటీన్ బయటికి నెట్టాడు.

అతన్ని తన్ని, ఆ కాంటీన్‌ని పునాదులతో సహా పెకలించి అవతల పారేయాలన్నంత కోపంతో తపించిపోయాడు గంగారాం.

ఆ గొడవను గమనించి పెద్ద పెద్ద అడుగులు వేస్తూ కిచెన్‌లో నుంచి బయటికి వచ్చారు నలుగురు వంటవాళ్ళు.

“మంచి మర్యాద తెలియని మీ వంటి అడవి మనుష్యులతో మాట్లాడటం నాకు చేతకాదు. మీతో గొడవ పెట్టుకోవటం నాకు ఇష్టం లేదు” అంటూ అక్కడి నుంచి కదిలి ఇంకో ప్రక్కకు వెళ్ళిపోయాడు.

గంగారాం నాన్‌స్టాప్ బస్‌లకు టిక్కెట్లు ఇచ్చే ఒక కౌంటర్ దగ్గిర నిలబడి తన పొజిషన్‌ని అంచనా వేసుకుంటుండగా రెట్టించిన శక్తితో అతన్ని ఎటాక్ చేసింది ఆకలి!

'తొందరపెట్టకు బ్రదర్... తొందరపెట్టి నా వీపును సాపుచేయించే ప్రయత్నాలు మొదలు పెట్టకు' పొట్టను సవరించుకుంటూ ఆకలిని హెచ్చరించి చుట్టూ చూశాడతను.

అప్పుడే వచ్చి అతనికి పాతిక గజాల దూరంలో ఆగుతోంది రతన్‌పూర్ నుంచి రెండు గంటల ఆలస్యంగా అక్కడికి వచ్చిన ఎక్స్‌ప్రెస్ బస్ ఒకటి.

ఒకరి నొకరు నెట్టుకుంటూ క్రిందిగి దిగుతున్న జనంలోకి జొరబడుతున్నది సన్నగా పొడుగ్గా వున్న పర్సనాలిటీ ఒకటి.

అడ్డు వచ్చిన ఒక వృద్ధురాలి మీద అనవసరంగా విరుచుకుపడుతూ, బస్‌లో నుంచి బయటికి వచ్చాడు పెద్దమనిషి ఒకతను. చేతుల్లో వున్న లగేజిని క్రింద పెట్టకుండా అలాగే నిలబడి దిక్కులు చూస్తున్నాడు.

చల్లచల్లగా అతని సమీపంలోకి జరిగి అత్యంత లాఘవంగా జేబును ఖాళీ చేశాడు సన్నపాటి పర్సనాలిటీ. పని పూర్తి అయిన మరుక్షణం అక్కడి నుంచి అవతలికి వెళ్ళిపోయాడు.

అదే పద్ధతిలో కాసిని డబ్బులు సంపాదించుకోమని గంగారాంకి సలహా యిచ్చింది అతని ఆకలి.

బస్ స్టేషన్స్ లోను, రైల్వేస్టేషన్స్ లోనూ తరచుగాకనిపించే పిక్ పాకెటీర్స్‌కి లీడర్ వంటి మనిషి ఒకతను ఆ చుట్టుపట్లే ఎక్కడో వుండివుంటాడు. అతని పర్మిషన్ తీసుకోకుండా, అతనికి చెల్లించవలసిన రుసుము చెల్లించకుండా రంగంలోకి దిగితే హూనమైపోతుంది వళ్ళు. విరిగిపోతాయి మక్కెలు.

కొత్తగా వచ్చి అప్పటి కప్పుడు బిజినెస్ ప్రారంభించటానికి వప్పుకోరు వాళ్ళు. నాలుగైదురోజులు జాగ్రత్తగా అబ్జర్వ్ చేసి, తమను బురిడీ కొట్టించటానికి వచ్చిన పోలీస్ మనిషి కాదని నిశ్చయం అయిన తరువాతనే అనుమతిని మంజూరుచేస్తారు.

పోలీసు మనిషి అనే మాట మనసులో మెదలగానే వెంటనే ఫ్లాష్ అయింది అతనికి ఒక గొప్ప ఆలోచన. ప్రమాదంతో కూడుకున్నదే అయినా, నసపెట్టి చంపుతున్న ఆకలిని అణుచుకోవటానికి అంతకంటే వేరేమార్గం గోచరించక, తెగించి బస్ స్టేషన్ చుట్టూ రెండు రౌండ్లు కొట్టిన తరువాత ఒక చింతచెట్టు చాటున అగుపించాడు సన్నపాటి పర్సనాలిటీ.

“ఎవరు నువ్వు? ఏం కావాలి నీకు?” అతన్ని గమనించి కోపంగా చూస్తూ అడిగాడు ఆ వ్యక్తి.

“ఎక్స్‌ప్రెస్ దిగిన పెద్దమనిషి జేబును నువ్వు ఖాళీ చేయటం నేను చూశాను” మరో అడుగు ముందుకు వేస్తూ అన్నాడు గంగారాం.

“చూస్తే ఏం చేస్తావ్? తలకొట్టి మొలేస్తావా?”

మొలవేయకపోయిన తల మీద కొట్టనే కొట్టాడు గంగారాం. జుట్టు పట్టుకొని చించెట్టు మొదలుకేసి బాదాడు.

“రాస్కెల్... ఈ పోలీస్ కానిస్టేబిల్ గంగారాం సాబ్ చూస్తూ వుండగా జేబుకొట్టింది చాలక పొగరుగా మాట్లాడతావా?” అంటూ మరో రెండుపోట్లు పొడిచి చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

“అయ్యబాబోయ్ క్షమించండి... మీరు పోలీసులని గుర్తించలేదు... నన్ను క్షమిచండి...” ఆందోళనగా అంటూ చేతిని వదిలించుకోవటానికి ప్రయత్నించాడు ఆ వ్యక్తి.

“రతన్‌పూర్ నుంచి ఈ రోజునే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాను. ఈ సాయంత్రం లోపల కనీసం నాలుగు కేసుల్ని తీసుకొస్తానని ఇన్‌స్పెక్టర్ గారికి ప్రామిస్ చేశాను. పదబే...” అంటూ మరింత గట్టిగా పట్టుకొని స్టేషన్ ఎదుట ఉన్న రోడ్డుకేసి లాగాడు గంగారాం.

ఖాళీగా ఉన్న ఎడమ చేత్తో ఛటాలున అతని పాదాల్ని వాటేసుకొన్నాడు సన్నపాటి వ్యక్తి.

“మీ పరువు ప్రతిష్టల కోసం నా పొట్టమీద కొట్టటం బాగోలేదు సాబ్... పట్టుకొచ్చిన పర్సు మీరు తీసేసుకోండి” అంటూ కళ్ళు వెంట నీళ్ళు పెట్టుకున్నాడు.

యాక్షన్ శృతిమించితే తన బండారం బయటపడి పోతుందని గంగారాం తెలుసు. అందుకే సీరియస్‌గా చూస్తూ అతని చేతిని వదిలేశాడు. లేచి నిలబడమని సైగ చేశాడు.

సలాం మీద సలాం చేస్తూ జేబులో వున్న పర్సును అతని ముందుకు జాపాడు సన్నపాటి వ్యక్తి.

“ఖబడ్దార్... ఎవరనుకుంటున్నావ్ బే నన్ను? పరాయి వాళ్ళ పర్సులు జేబులో పెట్టుకు తిరిగే చంచాననుకుంటున్నావా?” కనులు ఎర్రచేస్తూ ఎడాపెడా ఫైరయి పోయాడు గంగారాం.

నాలుక కరుచుకొని నెత్తిమీద చరుచుకున్నాడు సన్నపాటి వ్యక్తి. పర్సులో నిండుగా ఉన్న నోట్లనన్నిటినీ తీసి మళ్ళీ ముందుకు జాపాడు.

“తీసుకో... అన్నిటినీ తీసుకో... ఇంకో పది రోజులదాకా నన్ను ఏడిపించాల్సిన అవసరం నీకు ఉండదు... తీసుకో... వెంటనే గంగారాంని హెచ్చరించింది అతని ఆకలి.

పట్టుబడితే ఎముకలు విరిగిపోయే దెబ్బలకు సిద్ధపడి దొంగతనం చేశాడు ఆ వ్యక్తి. నోటి దగ్గరికి వచ్చిన ముద్దను గద్ద తన్నుకుపోయినట్లు, మొత్తం సొమ్మునంతా తను స్వాహా చేస్తే కచ్చగడతాడు... తన లీడర్ దగ్గిరికి పోయి వెంటనే రిపోర్ట్ చేస్తాడు.

కానిస్టేబిల్ గంగారాం సాబ్ ఎవరో తెలుసుకోవటానికి అర్జంట్‌గా ప్రయత్నిస్తాడు ఆ లీడర్.

గోటితో పోయేదాన్ని గొడ్డళ్ళ దాకా తీసుకుపోవటం దేనికి??

“తీసుకోండి గంగారాం సాబ్... డబ్బు తీసుకొని నన్ను వదిలేయండి...” డబ్బును అలాగే పట్టుకొని జాలి గొలిపే కంఠంతో అంటున్న సన్నపాటి వ్యక్తి భుజం తడుతూ చిన్నగా నవ్వాడు గంగారాం.

“పోలీసులంటే ఎవరని అనుకుంటున్నావ్ బే? పొట్టలు కొట్టే ఉద్యోగాలు చేసే రాక్షసులని అనుకుంటున్నావా? మనం బాగుండాలి. మనతోపాటు మన చుట్టూ వుండేవాళ్ళు కూడా బాగుపడాలి. నా పద్ధతి అది... నీ కష్టార్జితం అంతా నాకెందుకు బే... ఏదో కాస్తంత ఖర్చులకు వస్తేచాలు...” అంటూ రెండంటే రెండు నోట్లను తీసుకొని జేబులో పెట్టుకున్నాడు.

అంతవరకూ అతనొక బ్రహ్మరాక్షసుడని అనుకుంటున్న సన్నపాటి వ్యక్తిలో వచ్చేసింది విపరీతమైన మార్పు. ఈసారి తనంతట తనే అమాంతం క్రిందికి వంగి గంగారాం పాదాల్ని తాకాడు.

“మా అదృష్టంకొద్దీ మీరు ఈ ఊరికి ట్రాన్స్ఫర్ అయి వచ్చారు గంగారాం సాబ్! మీవంటి వాళ్ళు ఒక్కళ్ళు కాస్తంత అండగా వుంటే వేలకు వేలు సంపాదించి ఇస్తాము... నాతో పాటు రండి సాబ్... కాస్తంత చాయ్ తాగిన తరువాత మా వాళ్ళ నందర్నీ పరిచయం చేస్తాను. ఈ సాయంత్రానికే మీ జేబులు నిండిపోయే ఏర్పాట్లు చేస్తాను...” అంటూ అతని చేతిని తను పట్టుకొని బస్‌స్టేషన్ లోకి లాగాడు.

ఉలిక్కిపడి, వెంటనే తమాయించుకున్నాడు గంగారాం.

“ఇప్పుడు వద్దు బే... రేపు సాయంత్రం ఇక్కడే డ్యూటీ వేయించుకుంటాను. అప్పుడు పరిచయం చేద్దువు గాని... నాలాంటివాడి కళ్ళపడకుండా జాగ్రత్తగా మెసులుకో... అనవసరంగా దెబ్బలు తిని హాస్పిటల్ పాలుకాకు...” అని సలహా ఇస్తూ చేతిని వదిలించుకొని పెద్ద పెద్ద అడుగులతో రోడ్డు మీదికి వచ్చేశాడు.

బస్ స్టేషన్‌కి నాలుగు ఫర్లాంగులు అవతలగా వున్న ఒక హోటల్లోకి పోతుండగా వినవచ్చింది ఆ మ్రోత!

దారికి అడ్డుగా కనిపించిన ఒక పౌరుడిని రఫ్‌గా అవతలికి నెట్టి పరుగు ప్రారంభించబోతుండగా వచ్చి అతనికి పాతిక అడుగల దూరంలో ఆగింది ఒక పోలీస్ వాన్!!

"బుద్ధి గడ్డితిని పోలీస్ కానిస్టేబిల్ మాదిరి నటించాను సాబ్... ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చేయను. ఈ ఒక్క సారికి నన్ను క్షమించి వదిలేయండి..." సన్నపాటి వ్యక్తి దగ్గిర బెతాయించుకు వచ్చిన కరెన్సీ నోట్లను ఇచ్చేసి చెంపలు వేసుకుందామన్న ఉద్దేశ్యంతో డైలాగుల్ని రెడీ చేసుకుంటూ వాన్ వైపు అడుగులు వేసిన అతనికి వెంటనే తగిలింది రెండోషాక్.

ఏదో సామాన్యమైన ఇన్స్‌పెక్టర్ దిగుతాడని అనుకున్నాడతను. సామాన్యమైన ఇన్స్‌పెక్టర్ దిగటం అయితే దిగాడుగాని, దిగిన వెంటనే వాన్ డోర్స్‌ని తెరిచి పట్టుకొని వినయంగా నిలబడ్డాడతను. తన వెనుకే నేల మీదికి అడుగు పెడుతున్న పోలీస్ సూపరింటెండెంట్‌ని కన్నుసన్నలతోనే అక్కడి వారందరికీ చూపించాడు.

హోటల్లో నుంచి పరిగెత్తుకువచ్చి సలాం చేశాడు హోటల్ యజమాని. ఒకరితో ఒకరు పోటీలు పడుతూ అతని వెనుకే అరుగుదెంచి వినయంగా నమస్కారాలు చేశారు ఆ చుట్టుపట్ల వ్యాపారాలు చేసుకొనే పెద్ద మనుష్యులు అందరూ.

ఆ సందడి మధ్య అవతలికి జారుకొనే అవకాశం లభించినా ఉపయోగించుకోలేదు గంగారాం. బయటికి తీయబోతున్న కరెన్సీ నోట్లను జేబులోకి నెట్టేసి, అందరితోపాటు తనుకూడా సూపర్నెంట్ సాబ్‌కి నమస్కారం చేశాడు.

అంతటితో ఆగకుండా, "ధర్మప్రభువులు మండుటెండలో వచ్చారు. కాస్తంత కూల్ డ్రింక్ తీసుకుంటే చాలా బాగుంటుంది. హోటల్లోకి రండి సాబ్... ఫాన్ క్రింద కూర్చుని విశ్రాంతి తీసుకుందురుగాని లోపలికి రండి..." ఆ హోటల్ తనదే అయినట్లు గబగబా అన్నాడు.

మెచ్చుకోలుగా చూసి తల వూపాడు సూపర్నెంటు సాబ్.

"చూస్తూ నిలబడతావేమిటి భాయీ? లోపలికి పోయి మంచి టేబిల్‌ని చూడండి. ఫాన్‌ని ఫుల్ స్పీడ్‌లో పెట్టండి..." ప్రక్కకు తిరిగి హోటల్ యజమాని చెవిలో ఊదాడు గంగారాం.

హడావుడిగా వెనక్కి పరిగెత్తాడు హోటల్ యజమాని. అతను చెప్పిన ఏర్పాట్లు పూర్తిచేసి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"కూల్ డ్రింకులు రెడీగా? కూల్ డ్రింక్‌లు!" సూపర్నెంట్ సాబ్‌కి దారి చూపించి లోపలికి తీసుకువస్తూ పెద్దగా అడిగాడు గంగారాం.

వెంటనే వచ్చాయి అవి. అతనెవరో సూపర్నెంట్ సాబ్‌కి బాగా కావాల్సిన మనిషి అనుకుంటూ తనే స్వయముగా ఒక బాటిల్‌ని చేతికి అందించాడు హోటల్ యజమాని.

రెండే రెండు గుక్కల్లో దాన్ని ఖాళీచేసి సూపర్నెంట్ సాబ్ వైపు తిరిగాడు గంగారాం.

“ధర్మ ప్రభువులు స్వయంగా రావటం మాకు ఎంతో ఆనందాన్ని కలుగచేస్తోంది. మాతో కాగల పని ఏదయినా వుంటే వెంటనే చెప్పండి...” అంటూ రిక్వెస్ట్ చేశాడు.

అతని వినయానికి ముగ్ధుడైపోయాడు సూపర్నెంట్ సాబ్. తమ వెనుకే లోపలికి వచ్చిన ఇన్స్పెక్టర్ వైపు చూసి తల ఎగురవేశాడు.

నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తున్న వ్యాపారస్థులనందర్నీ వదిలేసి గంగారాంని ఒక ప్రక్కకు తీసుకుపోయాడు ఆ ఇన్స్పెక్టర్.

“మీరందరూ మాకు బాగా కావాల్సినవాళ్ళు కాబట్టే ముందుగా చెప్పకుండా అర్థాంతరంగా వచ్చేశాము... మన సూపర్నెంట్ సాబ్‌కి పెద్ద పని పెట్టింది మన ప్రభుత్వం. ఆ పని పూర్తి చేయాలంటే మీ సహకారం చాలా అవసరం!”

సూపర్నెంట్ సాబ్ చందాల కోసం బయలుదేరారని వెంటనే గ్రహించి, అక్కడి నుంచి వెళ్ళిపోకుండా ఆగినందుకు తనను తనే అభినందించుకున్నాడు గంగారాం.

జేబు దొంగల్ని, వీధి రౌడీలను దోచుకోవటంలో ఏముంది ఆనందం? కొడితే ఏనుగు కుంభస్తలాన్నే కొట్టాలి...

“చెప్పండి సాబ్... మా దగ్గిర సందేహించాల్సిన అవసరం కొంచెం కూడా లేదు. త్వరగా చెప్పండి...” అంటూ ఇన్స్పెక్టర్‌ని ప్రాంప్ట్ చేశాడు.

“బందిపోటు దొంగల్ని ఎదిరించటంలో ప్రాణాలు కోల్పోతున్న మా డిపార్ట్‌మెంట్ మనుష్యుల కోసం వెల్‌ఫేర్ ఫండ్‌ని స్టార్ట్ చేస్తోంది మన ప్రభుత్వం. అందుకు మన ఇలాకాలో నుంచి కనీసం పది లక్షలయినా పోగుచేయవలసిందిగా ఆర్డర్స్ పంపింది” చెప్పాడు ఇన్స్‌పెక్టర్.

బిగ్గరగా నవ్వి అదేమంత కష్టమయిన పని కాదని అన్నట్లు చిటికెలు వేశాడు గంగారాం. “ఈ కాస్త పనికి మీరు స్వయంగా రావాలా? కాకితో... కాకితో కబురు పెట్టినట్లయితే ఈ సాయంత్రానికల్లా మీకు కావల్సినంత తెచ్చి ఇచ్చేవాళ్ళం... ఇప్పటి కయినా ముంచుకు పోయింది ఏముందిట?” అంటూ వెనుతిరిగి సూపర్నెంట్ సాబ్ దగ్గిరికి వచ్చాడు.

“మీరు ఇంటికిపోయి విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. ఇంకో రెండు మూడు గంటల్లో పని పూర్తి చేసుకొని స్వయంగా వస్తాను నేను...” వినయాతి వినయంగా చెప్పాడు.

అంగీకార సూచకంగా తల వూపుతూ చటుక్కున లేచాడు సూపర్నెంట్ సాబ్ కుర్చీలో నుంచి. ఇన్స్‌పెక్టర్‌ని వెంటబెట్టుకొని వాన్ దగ్గిరికి వెళ్ళిపోయాడు.

అది కదిలి అవతలికి వెళ్ళిపోయేదాకా ఆగి, ఒక్కసారిగా గంగారాంని కమ్ముకొన్నారు వ్యాపారస్థులు అందరూ.

తన గుట్టురట్టు అయిపోయిందని అనిపించింది అతనికి. తగుదునమ్మా అంటూ వాగ్దానాలు చేసినందుకు వాళ్ళు తనకు నలుగుపెట్టే కార్యక్రమం చేపడతారేమో అని అనుమానం కలిగి, రెడీ అయిపోయాడతను ఫైటింగ్‌కి.

అటువంటి పని ఏదీ చేయకుండా–

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2046**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**